క్లుప్తంగా

5వ వార్డు ఎన్నిక ఏకగ్రీవం



రాజబాబుకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి పద్మరూప

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ పంచాయతీ 5వ వార్డు ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పద్మరూప సోమవారం తెలిపారు. రాజాల రాజబాబు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయండంతో 5వ వార్డు సభ్యుడిగా ఆయనను ప్రకటించారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ డివిజన్ కమిటీ సభ్యుడు బండి దావీదుకు వైఎస్సార్ సీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసి ఉన్న రామలింగేశ్వరుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఆలయ అర్చకులు వీరబాబు దత్తులు తెలిపారు. శ్రావణ సోమవారం సందర్భంగా మహన్యాస పారాయణం చేసి పంచామృతాభిషేకం అర్చన నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలు



ఇంటిపై రెపరెపలాడుతున్న జాతీయ జెండా

కొత్తపల్లి: ఆజాదీ కా అమృత మహోత్సవాల్లో భాగంగా మండలంలో ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి తమ దేశ భక్తిని చాటుతున్నారు. పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాలలోనూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. పాఠశాలలను, కార్యాలయాలను రంగుల జెండాలతో అలంకరించారు.

రోడ్లపై మురుగునీరు



చిట్టోడితోట ప్రాంతంలో రోడ్లపై నిలిచిన మురుగు నీరు

పిఠాపురం: పట్టణం చిట్టోడితోట ప్రాంతంలో మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. గత కొన్ని నెలలుగా మురుగునీరు రోడ్లపై ఉండిపోయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైన్లు ముసుకుపోవడం వల్ల మురుగునీరు నిలిచిపోయి క్రిమికీటకాలు పెరిగి అనారోగ్యాల పాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం వీధిలోకి రావడానికి కూడా వీలు లేకుండా ఉందని వెంటనే మురుగు నీరు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ఆప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా కొత్త డ్రైన్లు నిర్మిస్తామని, త్వరలోనే వాటిని పూర్తి చేస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి తెలిపారు.

చిత్రలేఖనం పోటీలు

పెద్దాపురం: వాలుతిమ్మాపురం రోడ్డులోని పట్టాభి అగ్రో ఫుడ్ లోహిత రైస్ బ్రాండ్ ఆధ్వర్యాన స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం బహుమతులు అందజేస్తామని సంస్థ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, సూర్యనారాయణ తెలిపారు.

డివిజన్ స్థాయి స్పందనకు 8 అర్జీలు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఏఓ పద్మజ

పెద్దాపురం: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి స్పందనలో ఎనిమిది అర్జీలు అందాయని ఇన్‌చార్జి పరిపాలనాధికారి (ఏఓ) పద్మజ, డిప్యూటీ తహసీల్దార్ భానుకుమార్ తెలిపారు. స్థలం ఆక్రమణ తొలగించాలని, భూ సర్వే చేయించి, న్యాయం చేయాలని, విద్యుత్ మీటర్ పునరుద్ధరించాలని అర్జీదారులు కోరారన్నారు. స్పందనలో వస్తున్న ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి, సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇక లెక్క పక్కా..

- గ్రామాల్లో చురుగ్గా ఓటర్ల సర్వే
- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న బీఎల్‌ఓలు
- నూతన ఓట్లకు దరఖాస్తుల స్వీకరణ
- 21తో ముగియనున్న గడువు
- పిఠాపురం నియోజకవర్గంలో 2,36,837 మంది ఓటర్లు



వాకతిప్పలో బీఎల్‌ఓలు చేస్తున్న ఓటర్ల సర్వేను తనిఖీ చేస్తున్న ప్రసాద్

కొత్తపల్లి: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైంది. ఓటుపైనే నేతల రాతలతో పాటు దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఇందుకోసం ఏటా ఎన్నికల సంఘం ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది కూడా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ–2024 పేరుతో నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్‌ను ప్రభుత్వం చేపట్టింది. జూలై 21వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ సర్వే ఆగస్టు 21 వరకూ కొనసాగుతుంది. బూత్ స్థాయి అధికారులు నేరుగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తూ పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ఈ సర్వే పిఠాపురం నియోజకవర్గంలో వేగంగా సాగుతోంది. కొత్తపల్లి, గొల్లప్రోలు రూరల్, గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం రూరల్, పిఠాపురం టౌన్‌లలో 242 పోలింగ్ కేంద్రాల్లో 2,36,837 మంది ఓటర్లు ఉన్నారు.

సర్వే విధానం ఇలా..

2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18ఏళ్లు నిండిన వారికి ఓటర్లు జాబితాలో చేర్చుతారు. ప్రధానంగా తప్పుల సవరణ, నూతన ఓట్లు నమోదు, నకిలీ ఓటర్లు తొలగింపు చేపట్టనున్నారు. ఓటర్ల జాబితాలో ఒకటి కంటే ఎక్కువ సార్లు నమోదైన, శాశ్వతంగా గ్రామం విడిచి వెళ్లిన వారు ఉంటే వారిని జాబితా నుంచి తొలగిస్తారు. ప్రస్తుతం ఉన్న జాబితాలో ఫొటో సరిగ్గా కనిపించకున్నా మార్చుకునేందుకు అవకాశం ఉంది. వయసులో వ్యత్యాసం, ఓటరు ఇంటి చిరునామా, వ్యక్తి గత వివరాల్లో మార్పులు చేర్పులకు వెసులుబాటు కల్పిస్తున్నారు. ఒక్క ఇంట్లో ఎక్కువ ఓట్లు ఉంటే వాటిని గుర్తించి ఒకటికి రెండు సార్లు పరిశీలించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఓటర్ల జాబితా సవరణలకు సంబంధించి ఇప్పటికే శిక్షణ పొందిన వారు బీఎల్వో ఓటరు యాప్ వెర్షన్ 4.7 ద్వారా నూతన ఓటర్లు నమోదు, పాత ఓట్ల తొలగింపు వంటివి యాప్ ద్వారా చేస్తున్నారు.

ప్రస్తుతం నియోజకవర్గంలో జనవరి 2023 నాటి ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం ఓటర్లు
కొత్తపల్లి	33,392	32992	66,384
గొల్లప్రోలు రూరల్	22,558	21,439	23,999
గొల్లప్రోలు నగర పంచాయతీ	10,428	10,521	20,679
పిఠాపురం రూరల్	31,882	30,639	62,521
పిఠాపురం టౌన్	20,871	22,380	43,254
మొత్తం	1,19,131	1,17,701	2,36,837

55 శాతం పూర్తి



గ్రామాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల సర్వే ఇప్పటి వరకూ 55 శాతం పూర్తయింది. ఈ నెల 21 తేదీకి వంద శాతం పూర్తి చేసే లక్ష్యంతో సర్వే జరుగుతోంది. సర్వేపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తున్నాం. ఇప్పటికే రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిచాం. వారిచ్చే సూచనలు, సలహాలు తీసుకుంటున్నాం. ఓటర్లు తొలగింపులో సంబంధిత ఓటర్లకు నోటీసులు అందించిన తరువాతే తదుపరి చర్యలు తీసుకోవాలని బీఎల్‌ఓలకు ఆదేశాలు జారీ చేశాం.

అర్హత కలిగిన ఏ ఒక్క ఓటును అకారణంగా తొలగించవద్దని చెప్పాం. 2024 జనవరి ఒకటో తేదీకి ఓటరుగా అర్హత ఉన్న వారికి ఓటు హక్కు కల్పిస్తున్నాం. ఈ సర్వే పారదర్శకంగా జరుగుతోంది. వలంటీర్లు దూరంగా ఉన్నారు. ఎప్పటికప్పుడు వెళ్లి సర్వేను పరిశీలిస్తున్నాం.

– జీవీఎస్ ప్రసాద్, తహసీల్దారు, కొత్తపల్లి మండలం

జీజీహెచ్‌లో డీఎంఈ ఆకస్మిక తనిఖీలు

కాకినాడ క్రైం: రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం జీజీహెచ్‌లో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఓపీ సరళితో పాటు ఇన్ పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ల్యాబ్‌లు, సీటీ స్కాన్, అల్ట్రా సౌండ్, రేడియాలజీ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగుల సౌకర్యార్థం ఈ నెలాఖరు నుంచి ఓపీలు కొనసాగుతున్న వివిధ విభాగాల భవంతుల్లోనే వైద్య, ఆరోగ్య పరీక్షల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్లను నియమించి శాంపిల్ కలెక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవిని ఆదేశించారు. వివిధ విభాగాధిపతులు, వైద్య బృందాలు, అధికారులతో జీజీహెచ్ కమ్యూనిటీ హాలులో సమావేశమై ఈ–ఆఫీసింగ్, ఈ–ఫైలింగ్, ఈ–ల్యాబ్‌ల నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేశారు. ఆరోగ్యశ్రీ కేసులు పెరిగేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఓడీలకు సూచించారు. ఆరోగ్యశ్రీ నమోదులో సాంకేతిక లోపాలు చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇన్ పేషెంట్ల నమోదులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై డీఎంఈకి రోగులు ఫిర్యాదు చేశారు. ఆధార్ కార్డుతో అనుసంధానమైన సెల్‌ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తేనే అడ్మిషన్ ఇస్తున్నారని చెప్పారు. పలుమార్లు ఓటీపీ రాకపోవడం అడ్మిషన్‌కు ప్రతిబంధకంగా మారుతోందని వివరించారు. దీనిపై స్పందించిన డీఎంఈ.. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలతో రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర శాఖకు తక్షణమే లేఖ రాసి, పరిష్కారానికి చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వీరుల గొప్పదనాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: వీరుల గొప్పదనాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, స్వాతంత్ర్య పోరాటంలో సాధించిన విజయాలను విద్యార్థులు తెలుసుకొని లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు సూచించారు. ఆజాదికా అమృత మహోత్సవాలు 2023 ముగింపు ఉత్సవాలను పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో 28వ వార్డు మంగయ్యమ్మ రావుపేట ఏకేపీఎం స్కూలులో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన జాతీయ పతాకాన్ని, వీరుల స్మారక శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పతాకాన్ని అందరి ఇళ్ల వద్ద ఎగురవేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ సిబ్బంది సచివాలయ, మెప్మా సిబ్బంది కౌన్సిలర్లు కోఆప్షన్ మెంబర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొని నా మట్టి నా దేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వాతంత్ర్య వీరులను స్మరించుకుంటూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దేశ అభివృద్ధి కోసం దేశ ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమైన పంచ ప్రాణ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, గండేపల్లి బాబీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన

- ఎంపీ వంగా గీత, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దొరబాబు
- తాటిపర్తిలో సచివాలయం, విలేజ్ క్లినిక్ భవనాల ప్రారంభం



తాటిపర్తిలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న గీత, దొరబాబు

పెద్దాపురం: సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో మెరుగైన ప్రజా సంక్షేమ పాలన కొనసాగుతోందని కాకినాడ ఎంపీ వంగా గీత, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని తాటిపర్తిలో సుమారు రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయం, విలేజ్ క్లినిక్ భవనాలను సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపు సూర్యకాంతి అధ్యక్షతన జరిగిన సభలో గీత, దొరబాబు మాట్లాడుతూ, మునుపెన్నడూ లేని విధంగా గాంధీజీ కన్న కలలను సాకారం చేస్తూ సచివాలయాలను స్థాపించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు, రైతులకు సంక్షేమ పథకాలు నేరుగా అందాలనే ఉద్దేశంతో వలంటీర్, సచివాలయ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతన్నలకు మెరుగైన వ్యవసాయ సేవలందించేలా చర్యలు చేపట్టారన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, ఆరోగ్య కేంద్రాలు నిర్మించి వ్యవసాయం, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారని కొనియాడారు. జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పులిమేరు పీఏసీఎస్ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కంటే వీర రాఘవరావు, ఆవాల లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు గోపు మురళి, నరాలశెట్టి బాబ్జీరావు మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వం నుంచి ఏదైనా సాయం పొందాలంటే మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుతం ఏ సర్టిఫికెట్, ఏ సేవ కావాలన్నా అందుబాటులోనే సచివాలయం ఉందని చెప్పారు. మెరుగైన పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ బందారు వీరబాబు, మండల కో ఆప్షన్ సభ్యుడు బిక్కిన వీర శేషకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు నల్లల నాగేంద్రబాబు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు యినకొండ వీర విష్ణుచక్రం, ఏలేటి అనంతలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా శిక్షణకు వస్తే చర్యలు

- సచివాలయ కార్యదర్శులకు హెచ్చరిక
- కమిషనర్లకు సమాచారం ఇస్తామన్న నోడల్ అధికారి



సచివాలయ కార్యదర్శుల శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి ఏసుబాబు

సామర్లకోట: ప్రభుత్వం ఇస్తున్న శిక్షణను సీరియస్‌గా తీసుకోవాలని, మొక్కుబడిగా వచ్చి, వెళ్లిపోతే కఠిన చర్యలు తప్పవని జిల్లా నోడల్ అధికారి, కాకినాడ నగరపాలక సంస్థ పరిపాలనాధికారి (ఏఓ) ఎం.ఏసుబాబు హెచ్చరించారు. కాకినాడ నగరపాలక సంస్థ, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీల్లోని సచివాలయ కార్యదర్శులకు స్థానిక టీటీడీసీలో ఇస్తున్న 3వ బ్యాచ్ శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. మున్సిపల్ డీఎంఏ ఆదేశాల మేరకు కంప్యూటర్ డిజిటల్ వ్యవస్థ, సోషల్ మీడియా, సర్వీసు అంశాలు, సచివాలయాలల్లో విధుల నిర్వహణపై నాలుగు రోజుల పాటు ఈ శిక్షణ ఇస్తున్నామని వివరించారు. ఈ శిక్షణకు కార్యదర్శులు మొక్కుబడిగా రావడంతో పాటు మధ్యలో అనేక మంది వెళ్లిపోతున్నట్టు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్లకు సమాచారం ఇస్తామని చెప్పారు. దీనివలన ఆయా సచివాలయ కార్యదర్శుల ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లలో కుదింపు ఉంటుందని హెచ్చరించారు. శిక్షణ చివరి రోజున రాత పరీక్ష నిర్వహించి, దానిలో పాస్ అయిన వారికి మాత్రమే సర్టిఫికెట్లు జారీ చేస్తామని తెలిపారు. వారికి మాత్రమే సచివాలయాల్లో కార్యదర్శులుగా గుర్తింపు ఉంటుందని తెలిపారు. వచ్చే నెల 14వ తేదీ వరకూ ఈ శిక్షణ ఇస్తామన్నారు. సచివాలయంలోని ఆరు కేటగిరీలకు చెందిన కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. శిక్షణకు డుమ్మా కొడుతున్న వారి వివరాలు అందజేయాలని ఆయా మున్సిపాలిటీల నోడల్ అధికారులు సూచించారు. ఫ్యాకల్టీ శ్రీకైలాస్ శిక్షణ ఇవ్వగా, మున్సిపల్ నోడల్ అధికారులు సీహెచ్ సుజాత, యు.జ్యోతిరామ్, ఎస్వీ రామారావు, కె.శ్రీనివాసరావు, కేపీ ప్రసన్న పర్యవేక్షించారు.

జీఈఆర్ సర్వే 100 శాతం పూర్తి చేయాలి



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఆర్‌జేడీ నాగమణి

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) సర్వే 100 శాతం పూర్తయ్యే విధంగా కృషి చేయాలని పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) నాగమణి ఆదేశించారు. స్థానిక జగ్గమ్మగారిపేట మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలను ఆమె సోమవారం తనిఖీ చేశారు. జగనన్న విద్యా కానుక, మధ్యాహ్న భోజన పథకం, హాజరు శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండేలా చూసేందుకు కొద్ది రోజులుగా జీఈఆర్ సర్వే జరుగుతోందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లు తమ పరిధిలో యాప్ ద్వారా ఈ సర్వే పూర్తి చేసి, ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు కృషి చేయాలని అన్నారు. ఎక్కడా బాల కార్మికులు ఉండడానికి వీలు లేదని, డ్రాపౌట్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 పి.పుల్లయ్య, ఎంఆర్‌పీలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు రైతుల సత్కారం



కలెక్టర్‌ను సత్కరించిన వీకే రాయపురం రైతులు

సామర్లకోట: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో కలెక్టర్ కృతికా శుక్లాను వీకే రాయపురం రైతులు సత్కరించారు. గతంలో ఏ జిల్లా అధికారీ స్పందించని విధంగా రైతుల సమస్యలను పరిష్కరించారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు అభినందన పత్రం అందజేశారు. గతంలో 'ఏలేరు కాలువపై శిథిలమైన కాజ్‌వే' శీర్షికన గతంలో సాక్షి దినపత్రిక ప్రచురించిన కథనానికి కలెక్టర్ వెంటనే స్పందించిన తీరు అమోఘమని కొనియాడారు. కాజ్‌వే మరమ్మతులకు రూ.6.65 లక్షలు మంజూరు చేయించి ఆదుకున్నారని తెలిపారు. అలాగే, మే 6న ఇరిగేషన్ వియర్ల సమస్యపై, ప్రచురించిన కథనానికి కూడా వెంటనే స్పందించారన్నారు. గ్రామంలోని తూటేరు డ్రైనులో గుర్రపు డెక్క పెరిగిపోవడంపై సాక్షి ప్రచురించిన కథనానికి స్పందించి, గుర్రపుడెక్క, తూటికాడ తొలగింపునకు రూ.1.95 లక్షలు మంజూరు చేసి, తమను మరోసారి ఆదుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఇలా తమను ఆదుకుంటున్న కలెక్టర్‌ను అభినందించడం తప్ప ఏమీ చేయలేమని రైతు నాయకులు తలారి దొరబాబు, ఇంటి వెంకట్రావు, వెలమర్తి శ్రీనివాసు, పెదిరెడ్ల కొండలరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఆర్డీఓ ఎస్వీవీ సత్యనారాయణ, ఎంపీడీఓ డి.శ్రీలలిత, డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి, తహసీల్దార్ ఎస్ఎల్వీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

కొత్తపల్లి: తాగునీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారని ఏసీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అన్నారు. మాయపట్నంలో ఏపీ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ, తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి ఎంపీడీఓ అబ్రహం లింకన్, తహసీల్దారు ప్రసాద్‌లకు వినతి పత్రం అందజేశారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

సత్రాల కమిటీలకు నోటిఫికేషన్

బోట్‌క్లబ్: నగరంలోని పలు సత్రాలకు నూతన కమిటీల నియామకానికి దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. స్థానిక మార్కెట్ వీధిలోని బంగారు చిన శోభనాద్రి సత్రం, దేవాలయం వీధిలోని పైడా చలమయ్య సత్రం, సినిమా రోడ్డులోని కోకనాడ అన్నదాన సమాజం, సినిమా రోడ్డులోని మంత్రిప్రగడ వారి సత్రం, జగన్నాథపురంలోని ఎంఎస్ఎన్ చారిటీస్‌లకు నూతన కమిటీలు నియమించనున్నారు. ఆయా కమిటీల నియామకానికి 20 రోజుల్లోగా అన్ని చర్యలూ తీసుకోవాలని ఈఓలను ఆదేశించారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం అధిక శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా కిటకిటలాడింది. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో తెల్లవారు జాము నుంచే భక్తులు స్వామి వారి తొలి అభిషేకం, తొలి పూజలు తిలకించడానికి బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలి పూజ చేశారు. అనంతరం భక్తుల అభిషేకాలు చేశారు. దేవస్థానం తరఫున భక్తులకు అన్నదానం చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్ట్‌బోర్డ్ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. స్వామి, అమ్మవార్లకు సాయంత్రం ప్రత్యేక అలంకరణ చేశారు. ఉపాలయాల్లో కూడా అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మౌలిక వసతులు కల్పించాలి

పెద్దాపురం: ఆనూరు దళిత కాలనీలో తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని రైతుకూలీలు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ, కాలనీ వాసులకు నిర్దిష్టమైన పట్టాలు మంజూరు చేసి, డ్రెయిన్లు, వీధి లైట్లు, సీసీ రోడ్లు, మంచినీటి వసతి వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

అప్రమత్తతతోనే నేరాల అదుపు



పోలీసు వారధి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై సునీత

సామర్లకోట: నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అప్పుడే వాటిని అదుపు చేయవచ్చని ఎస్సై టి.సునీత అన్నారు. స్థానిక సత్యనారాయణపురం సచివాలయం వద్ద సోమవారం రాత్రి నిర్వహించిన పోలీసు వారధి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్ నంబర్లు, ఫొటోలు ఇవ్వరాదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో ఫోనులో మాట్లాడవద్దని సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా తిరుగుతూ ఉంటే సచివాలయంలోని మహిళా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే పేకాట, జూదం వంటి వాటిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని, పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సేపెని సురేష్ కూడా పాల్గొన్నారు.

కోనేరు అసంపూర్తి పనులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీ కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో కోనేరు అభివృద్ధి పనులు అసంపూర్తిగా వదిలివేయడంపై కలెక్టర్ కృతికా శుక్లాకు భక్తులు ఫిర్యాదు చేశారు. ఆలయ కోనేరు అభివృద్ధికి ఎంపీ వంగా గీత విడుదల చేయించిన నిధులతో పురావస్తు శాఖ ఆధ్వర్యాన మార్చి నెల నుంచి పనులు జరుగుతున్నాయని ఆలయ భక్తసంఘం నాయకుడు తలుపుల అంజనీ కుమార్ కలెక్టర్‌కు తెలిపారు. ఐదు నెలలు గడుస్తున్నా కోనేరు పనులు ఇప్పటికీ పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పురావస్తు శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు జాప్యం కావడంతో పాటు నాణ్యతలో లోపం ఉంటోందని ఆరోపించారు. కోనేరులో పూడిక పూర్తిగా తొలగించాల్సి ఉండగా అసంపూర్తిగా వదిలేశారని, ఒక భక్తుడు ఇచ్చిన ఎర్ర గ్రావెల్‌తో కొంత మేరకు కోనేరులో నింపారని తెలిపారు. ఐదు నెలలుగా కోనేరులో నీరు లేకపోవడంతో పుణ్యస్నానాలకు, స్వామి వారి అభిషేకాలకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కోనేటిని ఇసుకతో నింపేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రావణ మాసం నాటికి భక్తులు కోనేరు జలాలు ఉపయోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని, ఈ పనుల్లో అవకతవకలపై విచారణ జరపాలని అంజనీ కుమార్ విజ్ఞప్తి చేశారు.